చిన్నారులకు రక్షణగా..

- అంగన్‌వాడీల్లో పిల్లల భద్రతకు 'మ్యాట్స్‌'
- అందుబాటులోకి టేబుళ్లు, ర్యాక్‌లు
- అక్షర పరిజ్ఞానానికి పుస్తకాలు
- జిల్లాలో 587 అంగన్‌వాడీ కేంద్రాలు



రబ్బర్‌ మ్యాట్‌లపై చిన్నారులు, పంపిణీ చేసిన టేబుళ్లు, ర్యాక్‌లు

గంభీరావుపేట: చిన్నారుల భవిష్యత్‌ను తీర్చిదిద్దాలంటే వారి ప్రారంభంలోనే సరైన మానసిక, ప్రశాంత వాతావరణం అవసరం. ఆ దిశగా ప్రభుత్వాలు ప్రయత్నాలు చేస్తున్నాయి. అందులో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నాయి. ఈ ఏడాది కేంద్రాల్లో మౌలిక సదుపాయల కల్పనకు పెద్దపీట వేయాలని మాత, శిశు సంక్షేమ శాఖ కార్యాచరణ రూపొందించింది. ఇందులో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రత్యేక పరికరాలు పంపిణీ చేస్తోంది. జిల్లాలో సిరిసిల్ల, వేములవాడ ఐసీడీఎస్‌ ప్రాజెక్టుల పరిధిలో 587 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. అందులో ఆరు నెలలోపు పిల్లలు 2757, మూడేళ్లలోపు 17,532 మంది, ఆరేళ్లలోపు 15,791 మంది చిన్నారులు ఉన్నారు.

భద్రతకు ప్రత్యేక చర్యలు

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు ఆడుకునే సమయంలో అనుకోకుండా జారిపడిపోవడం, గాయపడడం తరచూ జరుగుతుంటాయి. ఈ ప్రమాదాలను నివారించేందుకు ప్రభుత్వం కేంద్రాలకు నాణ్యమైన రబ్బర్‌ మ్యాట్‌లను పంపిణీ చేస్తోంది. బలమైన మృదువైన ఉపరితలంలో చిన్నారులు శారీరక ఆటలకు అడ్డంకులు లేకుండా ప్రమాదాలు నివారించడం దీని ప్రధాన లక్ష్యం. ఒక్కో కేంద్రానికి దాదాపు 8 మెత్తటి రబ్బర్‌ మ్యాట్‌లను పంపిణీ చేశారు. వాటిపై చిన్నారులను కూర్చోబెట్టి విద్యాబుద్ధులు నేర్పిస్తూ, ఆడిస్తున్నారు. పొరపాటున కిందపడినా దెబ్బలు తగలవు.

అక్షర పరిజ్ఞానానికి..

చిన్నారులను చదువుపై ఆసక్తి కలిగించే విధంగా పుస్తక ప్రదర్శనలకు ఏర్పాట్లు చేస్తున్నారు. అందులో భాగంగా ప్రతీ అంగన్‌వాడీ కేంద్రానికి పుస్తక ప్రదర్శన కోసం రెండు టేబుళ్లు, ర్యాక్‌, పుస్తకాలు పంపిణీ చేశారు. పిల్లల్లో గమనించే శక్తి, పట్టుదల, జ్ఞాపకశక్తి వంటి నైపుణ్యాలు పెంపొందించేందుకు ఇవి దోహదపడనున్నాయి. చిన్నారుల సామర్థ్యానికి తగ్గట్టుగా పుస్తకాలు ఎంపికచేసి టీచర్లు వారికి అక్షర పరిజ్ఞానం కలిగించనున్నారు. రకరకాల బొమ్మలు ఏర్పాటు చేసి ప్రయోగాత్మకంగా చూపించేందుకు టేబుళ్లు ఉపయోగపడనున్నాయి. ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాలు రంగు రంగుల మ్యాట్‌లు, టేబుళ్లు, ర్యాక్‌లు, పుస్తకాలతో కళకళలాడుతున్నాయి.

పర్యవేక్షణపై ప్రత్యేక దృష్టి

ప్రభుత్వం సరఫరా చేసిన పరికరాలను అంగన్‌వాడీ కేంద్రాల్లో వినియోగిస్తున్నారా.. లేదా మూలనపడేశారా అనే దానిపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. విధి నిర్వహణలో రోజు హాజరైన చిన్నారుల ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్‌ చేసేటప్పుడు మ్యాట్‌పై చిన్నారులు ఉండాలనే నిబంధన పెట్టారు. యాప్‌లో నమోదైన ఫొటోలను జిల్లా, రాష్ట్ర అధికారుల పర్యవేక్షణకు సులభతరంగా తెలిసిపోతోంది. క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందో పరికరాల సద్వినియోగం గురించి అధికారులు గమనించే అవకాశం ఉంది.

చిన్నారుల సమగ్రాభివృద్ధికి దోహదం



అంగన్‌వాడీ కేంద్రాలు అభివృద్ధి కేంద్రాలుగా మారుతున్నాయి. మౌలిక సదుపాయాల కల్పనతో చిన్నారుల సమగ్రాభివృద్ధికి బీజం వేస్తున్నాయి. చిన్నారులకు ఆరోగ్యవంతమైన, ఆనందదాయక, ఆకర్షణీయమైన వాతావరణం అంగన్‌వాడీ కేంద్రాల్లో నెలకొంది. మ్యాట్‌లు, ర్యాక్స్‌, టేబుళ్లు, పుస్తకాలు ప్రతీ కేంద్రానికి పంపిణీ చేసి వినియోగంపై పర్యవేక్షిస్తున్నాం.

– రేణుక, ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌, గంభీరావుపేట

క్లుప్తంగా

రేషన్‌ కార్డులతో పేదలకు లబ్ధి



మంజూరుపత్రాలు ఇస్తున్న నాయకులు

బోయినపల్లి: నూతన రేషన్‌ కార్డుల మంజూరుతో పేదలకు లబ్ధి చేకూరుతుందని ఏఎంసీ చైర్మన్‌ బోయిని ఎల్లేశ్‌యాదవ్‌ పేర్కొన్నారు. బోయినపల్లిలో పలువురికి శుక్రవారం కాంగ్రెస్‌ నాయకులతో కలిసి రేషన్‌కార్డుల మంజూరుపత్రాలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చొరవతో పేదలకు రేషన్‌ కార్డులు మంజూరయ్యాయన్నారు. నాయకులు సంబ లక్ష్మీరాజం, పిట్టల రమేశ్‌, నల్ల మోహన్‌, ద్యావ మహిపాల్‌ రెడ్డి, మ్యాన కరుణాకర్‌, పొత్తూరి మహేందర్‌, ఎం.శ్రీకాంత్‌, బోయిని పర్శరాం, మల్లేశం, గుంటి జలేందర్‌, మాడిశెట్టి పురుశోత్తం,నల్లగొండ శ్రీనివాస్‌ తదితరులు ఉన్నారు.

తంగళ్లపల్లి: నిరుపేద ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందించడమే కాంగ్రెస్‌ పార్టీ లక్ష్యమని సిరిసిల్ల ఏఎంసీ వైస్‌ చైర్మన్‌ నేరెళ్ల నర్సింగం గౌడ్‌ అన్నారు. సారంపల్లిలో లబ్ధిదారులకు కాంగ్రెస్‌ యూత్‌ కాంగ్రెస్‌ జిల్లా ఉపాధ్యక్షుడు మునిగెల రాజుతో కలిసి రేషన్‌ కార్డుల ప్రొసీడింగ్స్‌ అందజేశారు. కాంగ్రెస్‌ మానవ హక్కుల యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గుగ్గిళ్ల భరత్‌ గౌడ్‌, యూత్‌ కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు ఎగుర్ల ప్రశాంత్‌, మార్కెట్‌ కమిటీ డైరెక్టర్‌ రాములు, మాజీ ఉపసర్పంచ్‌ గుండి పర్శరాములు, మండల మైనారిటీ ప్రధాన కార్యదర్శి ఎండీ.హనీఫ్‌, తదితరులు పాల్గొన్నారు.

నానో యూరియాపై అవగాహన

బోయినపల్లి: మండలంలోని కోరెం సింగిల్‌విండోతో పాటు మండలకేంద్రంలోని ఎరువుల దుకాణాల్లో శుక్రవారం నానో యూరియా వాడకంపై ఎంఏవో ప్రణీత రైతులకు అవగాహన కల్పించారు. 500 మి.లీ. నానో యూరియా బస్తా యూరియాతో సమానమని తెలిపారు. వరి, మొక్కజొన్న, పత్తి పంటలలో 2, 3వ దఫాల్లో పై పాటుగా వేసే యూరియాను నానో యూరియా పూర్తిగా భర్తీ చేస్తుందన్నారు.

కరాటే పోటీల్లో ప్రతిభ



వేములవాడ: సిరిసిల్ల పట్టణంలోని ఈనెల 4న జరిగిన గోజురోయ్‌ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో వేములవాడ పట్టణానికి చెందిన హంసిని, ధార్మిక లిటిల్‌ జీనియస్‌ స్కూల్‌లో చదివే ఐదుగురు విద్యార్థులు పలు విభాగాల్లో ప్రతిభ కనబర్చారు. బంగారు, వెండి, పతకాలు సాధించినట్లు కరస్పాండెంట్‌ నరాల సంతోష్‌ తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులు, గెలుపొందిన విజేతలను ఆయన అభినందించారు.

'క్షయ'పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

కోనరావుపేట: మండలంలోని మామిడిపల్లిలో టీబీ ముక్త్‌ భారత్‌ అభియాన్‌ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రామస్తులకు క్షయవ్యాధిపై అవగాహన కల్పించారు. రెండు వారాలకు మించి దగ్గు, రాత్రిపూట జ్వరం, బరువు తగ్గడం, ఆకలి లేకపోవడం వంటి లక్షణాలుంటే ఆరోగ్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌ రషీద్‌, టీబీ సూపర్‌వైజర్‌ జేత్యా, ఏఎస్‌ఎం వరలక్ష్మి, ఆశాకార్యకర్తలు జ్యోతి, సుజాత, రమణ తదితరులు పాల్గొన్నారు.

లో వోల్టేజీ సమస్య పరిష్కరించాలి

తంగళ్లపల్లి: మండలంలోని బాలమల్లుపల్లె గ్రామ పరిధిలో లోవోల్టేజీ సమస్యను పరిష్కరించాలని సెస్‌ చైర్మన్‌ చిక్కాల రామారావును గ్రామస్తులు కోరారు. శుక్రవారం సెస్‌ చైర్మన్‌ బాలమల్లుపల్లె, రామోజీపేట గ్రామస్తులతో మాట్లాడి విద్యుత్‌ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నాయకులు, రైతులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌ అధికారంలోకి వచ్చాకే అభివృద్ధి పనులు'

వేములవాడరూరల్‌: పల్లెల్లో కాంగ్రెస్‌ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత పదేళ్లలో జరగని అభివృద్ధి పనులు జరిగాయని మాజీ ఎంపీటీసీ వీరారెడ్డి అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేములవాడ రూరల్‌ మండలంలోని మల్లారంలో ఏడాదిన్నర కాలంలో దాదాపు రూ. కోటివరకు అభివృద్ధి పనులు జరిగినట్లు ఆయన తెలిపారు. గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వంలో ఎన్నో పనులకు ప్రతిపాదనలు పంపినా అప్పటి నాయకులు పట్టించుకోలేదన్నారు. గ్రామంలో రాజీవ్‌నగర్‌ ప్రభుత్వ పాఠశాల ఎనిమిదేళ్లుగా మూతబడిందని, విద్యార్థులు రోజు కిలోమీటర్‌ వరకు నడిచి మల్లారం వరకు వెళ్లేవారన్నారు. ఈ విషయమై ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ దృష్టికి తీసుకెళ్లగా పాఠశాలకు మరమ్మతు పనుల కోసం నిధులు మంజూరు చేసి గ్రామస్తుల సహకారంతో పాఠశాలను పునఃప్రారంభించినట్లు తెలిపారు. లో వోల్టేజీ సమస్య, ఓపెన్‌ జిమ్‌, సీసీరోడ్లు, చెక్‌డ్యాం నిర్మాణ పనులు, తాగునీటి, తదితర సమస్యలు పరిష్కారమయ్యాయన్నారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం



ముస్తాబాద్‌లో పూజలు చేస్తున్న మహిళలు



ఎల్లారెడ్డిపేట: గొల్లపల్లి గీతా మందిరంలో పూజలు చేస్తున్న మహిళలు



కోనరావుపేటలో..

ముస్తాబాద్‌: మండలంలో మహిళలు భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా మండలవ్యాప్తంగా పలు గ్రామాల్లో మహిళలు వరలక్ష్మీ వ్రతం నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి చిత్రపటాలకు, విగ్రహాలను అలంకరించి వ్రతం ఆచరించారు. మహిళలు పసుపు బొట్టుతో వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు.

ఎల్లారెడ్డిపేట: రాచర్లగొల్లపల్లి శ్రీ గీతా మందిరంలో మహిళలు సామూహిక కుంకుమ, మహాలక్ష్మీ పూజలు నిర్వహించారు. ఆలయంలో మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు రాచర్ల రఘురామశర్మ, పాలెపు రవీందర్‌శర్మ, గీతా మందిరం కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: మండలంలోని పలు గ్రామాల్లో వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. మహిళలు వాయినాలు ఇచ్చుపుచ్చుకున్నారు. ఇల్లంతకుంటలోని గంగాధర క్షేత్ర ఆలయం, జంగారెడ్డిపల్లిలోని రామలింగేశ్వర ఆలయం, పూజా కార్యక్రమంలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

కోనరావుపేట: మండలకేంద్రంతో పాటు పలు గ్రామాల్లో వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. మహిళలు వ్రతాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వర్లు

చందుర్తి: ఆటో యాజమానులు, డ్రైవర్లు నిబంధనలను పాటించాలని చందుర్తి సీఐ గాండ్ల వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన ఆటో, ట్రాలీ ఆటోల యాజమానులు, డ్రైవర్లకు ట్రాఫిక్‌ నిబంధనలపై పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలించవద్దన్నారు. విద్యార్థులను తీసుకెళ్లటప్పుడు జాగ్రత్తగా వాహనాలు నడపాలన్నారు. డ్రైవర్లకు లైసెన్స్‌లు ఉండాలన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్సై జిల్లెల రమేశ్‌ మాట్లాడుతూ అతివేగంతో ప్రమాదాలు జరుగుతాయని, నిబంధనలు పాటించకుంటే కేసులు నమోదు చేస్తామన్నారు. ఆటో యూనియన్‌ నాయకులు, యాజమానులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• హైదరాబాద్‌కు తరలివెళ్లిన బీజేపీ నాయకులు

వేములవాడ: హైదరాబాద్‌లో సిట్‌ విచారణకు హాజరైన కేంద్రమంత్రి బండి సంజయ్‌కు మద్దతుగా వేములవాడ బీజేపీ నాయకులు శుక్రవారం తరలివెళ్లారు. పట్టణశాఖ అధ్యక్షుడు రాపెల్లి శ్రీధర్‌ నేతృత్వంలో 20 వాహనాల్లో తరలివెళ్లారు. గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం ఫోన్‌ ట్యాపింగ్‌ వ్యవహారంలో బండి సంజయ్‌ ఆధారాలతో సిట్‌ముందు హాజరైన సందర్భంగా మద్దతుగా వెళ్లినట్లు శ్రీధర్‌ పేర్కొన్నారు.

• యూరియా కోసం తిప్పలు

ఇల్లంతకుంట: ఇల్లంతకుంట ప్యాక్స్‌, సొసైటీల్లో యూరియా కొరతతో మండల రైతులకు తిప్పలు తప్పడం లేదు. గాలిపెల్లి ప్యాక్స్‌ సొసైటీ గోదాంకు ఈ ఖరీఫ్‌ సీజన్‌లో ఒకేసారి 330 యూరియా బస్తాలు వచ్చాయని, మళ్లీ సరఫరా కాలేదని సొసైటీ కార్యదర్శి తెలిపారు. సొసైటీల్లో బస్తా రూ.265 కాగా ప్రైవేట్‌ ఫర్టిలైజర్‌ షాపులలో 300 అమ్ముతుంటారు. ఇల్లంతకుంట ప్యాక్స్‌ పరిధిలోని పెద్ద లింగాపురం, కందికట్కూర్‌, రేపాక, ఇల్లంతకుంటలో సొసైటీ గోదాంలు ఉన్నట్లు చైర్మన్‌ తిరుపతిరెడ్డి తెలిపారు. మండల వ్యవసాయాధికారి సురేశ్‌రెడ్డిని సంప్రదించగా రెండ్రోజుల్లో స్టాక్‌వస్తుందన్నారు.

• ప్రభుత్వ భూమిలో ఇటుక బట్టీలు తొలగింపు

వేములవాడఅర్బన్‌: వేములవాడ మండలం తెట్టకుంట శివారు ప్రభుత్వ భూమిలో ఉన్న ఇటుక బట్టీలను కలెక్టర్‌ ఆదేశాల మేరకు తొలగించినట్లు తెలిసింది. తెట్టకుంట శివారులోని ఓవ్యక్తి ప్రభుత్వ స్థలం సర్వే నెంబర్‌ 25, 26లో సుమారుగా పదెకరాల స్థలంలో ఇటుక బట్టీలు ఉంచారన్న సమాచారంతో రెవెన్యూ అధికారులు శుక్రవారం మూడు ఇటుకబట్టీలు, లెబర్‌షెడ్లను తొలగించినట్లు తెలిసింది.

• డీఎస్పీ విచారణ

ముస్తాబాద్‌: మండలంలోని కొండాపూర్‌లో సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం విచారణ చేపట్టారు. ఇటీవల నమోదైన అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ చేసినట్లు ఎస్సై గణేశ్‌ తెలిపారు. ఇరువర్గాల వివరాలను నమోదు చేసుకొని సాక్షులను విచారించినట్లు పేర్కొన్నారు.

• వన్యప్రాణుల మాంసం తరలిస్తున్న ఇద్దరికి జరిమానా

ముస్తాబాద్‌: పోతుగల్‌లో వన్యప్రాణుల మాంసాన్ని తరలిస్తున్న ఇద్దరికి జరిమానా విధించినట్లు డిప్యూటీ ఫారెస్టు రేంజ్‌ ఆఫీసర్‌ అంజలి తెలిపారు. హుజూరాబాద్‌కు చెందిన పోచయ్య, జంపయ్య పోతుగల్‌ శివారులో ఓ సంచిలో అడవిపంది మాంసాన్ని తీసుకెళ్తూ పోలీసులకు పట్టుబడ్డారన్నారు. స్వాధీనం చేసుకుని పూడ్చిపెట్టామని, ఇద్దరికి రూ.25వేల జరిమానా విధించినట్లు అంజలి తెలిపారు.

• బోరు మోటారు చోరీ

వీర్నపల్లి: బావుసింగ్‌ నాయక్‌ గ్రామం శ్మశానవాటికలో ఉన్న బోరు మోటార్‌ను ఈనెల 6న గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించినట్లు ఎస్సై లక్ష్మణ్‌ శుక్రవారం తెలిపారు. శుక్రవారం చోరీ జరిగిన ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే 871265 6376, 8499835160 నెంబర్లలో సమాచారం ఎస్సై పేర్కొన్నారు.

18 వరకు ప్రవేశాలు

సిరిసిల్ల ఎడ్యుకేషన్‌: తెలంగాణ ఓపెన్‌ స్కూల్‌ సొసైటీ ఆధ్వర్యంలో టెన్త్‌, ఇంటర్‌లో ప్రవేశాలు పొందేందుకు ఈనెల 18 వరకు అవకాశం ఉన్నట్లు ఉమ్మడి జిల్లా ఓపెన్‌ స్కూల్‌ సొసైటీ కోఆర్డినేటర్‌ నాగేశ్వరరావు తెలిపారు. 14 ఏళ్లు పూర్తయిన వారు పదో తరగతిలో ప్రవేశాలు తీసుకోవచ్చని, పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించి 15 ఏళ్లు పూర్తయిన అభ్యర్థులు ఇంటర్‌లో ప్రవేశాలు తీసుకోవచ్చన్నారు.

స్పాట్‌ అడ్మిషన్లు

తంగళ్లపల్లి: మండలంలోని మండెపల్లి మోడల్‌ స్కూల్‌లో స్పాట్‌ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్‌ మామిల్ల విఠల్‌ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరవ తరగతిలో లో 6, ఏడులో 8, ఎనిమిదిలో 7, తొమ్మిది తరగతిలో 12, పదిలో 8 సీట్లు ఖాళీలు ఉన్నాయన్నారు. విద్యార్థులు మెమో, ఆదాయం, కుల ధ్రువీకరణ పత్రాలతో ఈనెల 13న సాయంత్రం 4 గంటల్లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మెరిట్‌, అర్హత పరీక్ష ఆధారంగా సీట్లు కేటాయిస్తామని పేర్కొన్నారు.

రైస్‌మిల్‌కు విద్యుత్‌ నిలిపివేత

వేములవాడరూరల్‌: వేములవాడ మండలం మర్రిపల్లి శివారులోని సర్వేనంబర్‌ 750లో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మించినట్లు గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదుతో మారుతి రైస్‌మిల్‌కు విద్యుత్‌ను నిలిపివేసినట్లు వేములవాడరూరల్‌ ఏఈ రాకేశ్‌రెడ్డి తెలిపారు. కొన్ని రోజులుగా మిల్లుపై వస్తున్న ఆరోపణలకు కలెక్టర్‌ ఆదేశాలతో పలుశాఖల అధికారులు ఈ మిల్లును తనిఖీలు చేశారు. వాటి ఆధారంగా కలెక్టర్‌ ఇటీవల రైస్‌మిల్లు నిబంధనల ప్రకారం అనుమతులు పొందలేదని, ఇచ్చిన అనుమతులను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఈ మిల్లుకు విద్యుత్‌ను కూడా నిలిపివేయాలని జిల్లా అధికారుల ఆదేశాలతో వేములవాడ రూరల్‌ ఏఈ విద్యుత్‌ సరఫరా నిలిపివేసినట్లు ఆయన శుక్రవారం పేర్కొన్నారు.

మండల పరిషత్‌లో ఎఫ్‌ఆర్‌ఎస్‌



ఎఫ్‌ఆర్‌ఎస్‌ను పరిశీలిస్తున్న ఎంపీవో రాజు

ఎల్లారెడ్డిపేట: ఇక నుంచి మండల పరిషత్‌ కార్యాలయంలో సైతం ఉద్యోగులకు క్రమం తప్పకుండా విధులకు హాజరయ్యేందుకు ఫేస్‌ రికగ్నేషన్‌ సిస్టమ్‌ (ఎఫ్‌ఆర్‌ఎస్‌) ఉపయోగించేలా ఏర్పాటు మొదలయ్యాయి. ఉద్యోగుల డాటాను క్రమబద్ధంగా ఎన్‌రోల్‌మెంట్‌ చేశారు. ఉద్యోగులు విధులకు డూమ్మా కొట్టకుండా ఉదయం, సాయంత్రం ఎఫ్‌ఆర్‌ఎస్‌ హాజరు ప్రవేశపెట్టనున్నారు. అందుకు సంబంధించి మండల పరిషత్‌లో అధికారులు అమలుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

కళాకారులకు డప్పుల పంపిణీ



డప్పులు పంపిణీ చేస్తున్న వెంకటేశం గౌడ్‌

వేములవాడరూరల్‌: వేములవాడ మండలం వట్టెంలలో మాజీ ఎంపీపీ రంగు వెంకటేశంగౌడ్‌ వంద మంది డప్పు కళాకారులకు శుక్రవారం డప్పులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ రొండి రాజు, కాంగ్రెస్‌ పార్టీ మండల అధ్యక్షుడు వకుళాభరణం శ్రీనివాస్‌, నాయకులు బొడ్డ రాములు, ప్రవీణ్‌, సోమినేని బాలు, పిట్టల వెంకటేశం, కళాకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



సిరిసిల్ల టౌన్‌ : రాఖీలు కడుతున్న విద్యార్థినులు

ముందస్తు రాఖీ వేడుకలు



ఎల్లారెడ్డిపేటలోని పాఠశాలలో..



చందుర్తి సీఐకి రాఖీ కడుతున్న విద్యార్థిని



తంగళ్లపల్లి : రాఖీలు కడుతున్న విద్యార్థినులు

సిరిసిల్లటౌన్‌/తంగళ్లపల్లి/చందుర్తి/ఎల్లారెడ్డిపేట/ఇల్లంతకుంట: జిల్లా కేంద్రంలో ముందస్తు రాఖీ వేడుకలు శుక్రవారం నిర్వహించారు. విద్యార్థినులు తోటి విద్యార్థులకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీ కృష్ణవేణి టాలెంట్‌ స్కూల్‌, ఇంగ్లిష్‌ యూనియన్‌, తక్షశిల తదితర పాఠశాలల్లో ఆయా విద్యాసంస్థల కరస్పాండెంట్‌లు పాల్గొన్నారు. తంగళ్లపల్లి మండలం తాడూర్‌ అంగన్‌వాడీ కేంద్రంలో రక్షాబంధన్‌ వేడుకలు నిర్వహించారు. తల్లిపాల వారోత్సవాలు నిర్వహించి గర్భిణులు, బాలింతలకు తల్లిపాల విశిష్టతను వివరించారు. చిన్నారులతో రాఖీలు కట్టించారు. చందుర్తి పోలీస్‌స్టేషన్‌లో రాఖీ వేడుకలు నిర్వహించారు. మండలకేంద్రంలోని నవత ఇంగ్లిష్‌ మీడియం పాఠశాల విద్యార్థినులు సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై రమేశ్‌, సిబ్బందికి రాఖీలు కట్టారు. బ్రహ్మకుమారి సువర్ణ ఆధ్వర్యంలో స్టేషన్‌ సిబ్బందికి రాఖీలు కట్టారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి, రాచర్లబొప్పాపూర్‌, ఎల్లారెడ్డిపేటలోని పలు పాఠశాలల్లో రక్షాబంధన్‌ వేడుకలు నిర్వహించారు. శ్రీ చైతన్య పాఠశాలలో బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి దయాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో, తంగళ్లపల్లి మండలకేంద్రంలోని శ్రీసరస్వతి శుభోదయం స్కూల్‌, ఇల్లంతకుంట మండలకేంద్రంలో మహిళా కాంగ్రెస్‌ పార్టీ ఆధ్వర్యంలో రాఖీ వేడుకలు జరిపారు. మహిళా కాంగ్రెస్‌ కార్యకర్తలు , నాయకులకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

పర్యావరణానికి రక్షాబంధన్‌



వేములవాడఅర్బన్‌: అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇకోక్లబ్‌, వృక్షశాస్త్ర విభాగం, ఫుడ్‌సైన్స్‌ విభాగం విద్యార్థులు ఇంట్లో ఉండే దినుసులుతో పర్యావరణానికి హాని చేయని రాఖీలను తయారు చేశారు. కళాశాల ప్రిన్సిపా ల్‌ శంకర్‌, వైస్‌ ప్రిన్సిపా ల్‌ లావణ్య, అధ్యాపకులు కరుణ, శోభారాణి, శ్రీధర్‌రావు, కృష్ణప్రసాద్‌ తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడుగుంత విషయంలో గొడవ

- పరస్పరం దాడి



దాడిలో తలకు గాయమైన కొలకాని సురేష్‌



చందుర్తి ఠాణా గేటుకు తాళం వేసి ఉందని ఫొటోను పంపిన క్షతగాత్రుడు సురేష్‌

చందుర్తి: మండలంలోని తిమ్మాపూర్‌లో ఇంటి స్థలం విషయంలో శుక్రవారం రాత్రి ఇద్దరు గొడవపడ్డారు. ఈ గొడవలో ఇద్దరు గాయపడ్డారు. బాధితుడు కొలకాని సురేశ్‌ తెలిపిన వివరాలు. కొలకాని సురేశ్‌, అదే గ్రామానికి చెందిన బొజ్జ రాజు మధ్య ఇంకుడుగుంత విషయంలో వివాదం ఉంది. ఈ విషయంలో గొడవ పడ్డారు. తనను రాజు కొట్టాడని ఫిర్యాదు చేసేందుకు పోలీస్‌స్టేషన్‌కు వెళ్తే గేట్‌కు తాళం వేసి ఉందని సురేశ్‌ తెలిపాడు. ఫిర్యాదు చేసేందుకు స్టేషన్‌ లోపలికి వెళ్లలేకపోతున్నానని మీడియాకు ఫోన్‌ ద్వారా తెలిపారు. ఈ విషయమై చందుర్తి ఎస్సై రమేశ్‌ను 'సాక్షి' వివరణ కోరగా పెద్ద గేటుకు తాళం వేశామని, చిన్న గేటు తెరిచే ఉందని తెలిపారు. మద్యం మత్తులో అతనికి గేటు కనిపించకపోతే మేము ఏమి చేస్తామని వివరణ ఇచ్చారు. అంతేకాకుండా ఎదుటి వ్యక్తి రాజుకు గాయాలైతే పోలీసులే ఆస్పత్రికి తీసుకెళ్లారని తెలిపారు.

వీధిలైట్లు ఏర్పాటు



సాక్షి స్పందన

బోయినపల్లి: బోయినపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని పలు వార్డుల్లో రాత్రిపూట వీధి లైట్లు వెలగడం లేదని 'వెలగని వీధిలైట్లు' అనే శీర్షికన ఈనెల 5న సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కలెక్టర్‌ సందీప్‌కుమార్‌ ఝా ఆదేశాలతో ఎంపీడీవో భీమా జయశీల ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి అనిల్‌ బోయినపల్లి గ్రామపంచాయతీ పరిదిలోని 1, 11 వార్డులతో పాటు, శ్రీనగర్‌కాలనీ, వీరనగర్‌, బస్టాండ్‌ ఏరియాలో వీధిలైట్లు బిగించారు. గ్రామంలో పలు ప్రాంతాల్లో సుమారు 90 వరకు వీధిలైట్లు గురు, శుక్రవారాల్లో కొత్తవి ఏ ర్పాటు చేసినట్లు కార్యదర్శి అనిల్‌ తెలిపారు. నెలరోజులుగా ఇబ్బందిపడ్డ ప్రజలు సాక్షి చొరవతో పలు వార్డుల్లో వీధిలైట్లు వెలగడంతో హర్షం వ్యక్తంచేశారు. కారోబార్‌ నాగరాజు, సిబ్బంది ఉన్నారు.

సీజనల్‌ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఎల్లారెడ్డిపేట: సీజనల్‌ వ్యాధులపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారిణి సారియా అంజుమ్‌ అన్నారు. దుమాల గురుకుల ఏకలవ్య పాఠశాలలో 63 మంది విద్యార్థులు జ్వరాలతో బాధపడుతుండగా, వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. నలుగురు తీవ్ర జరంతో ఉండగా, రక్త నమూనాలను ల్యాబ్‌కు పంపించా రు. సూపర్‌వైజర్‌ పద్మజ, ఎంఎల్‌హెచ్‌పీ శిల్ప తదితరులున్నారు.

వర్షానికి కూలిన ఇల్లు



ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్ల బొప్పాపూర్‌లో వర్షానికి జల్లి పోచవ్వ అనే వృద్ధురాలి ఇల్లు కూ లిపోయింది. వివరాల్లోకి వెళ్తే.. పోచవ్వ భర్త లస్మయ్య 20 ఏళ్ల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. కొడుకు సత్యం బతుకుదెరువు కోసం దు బాయ్‌కు వెళ్లగా కోడలు అరుణ, మనవడితో కలిసి పోచవ్వ ఇంట్లో నివాసముంటోంది. ఉన్న ఇల్లు కూలిపోవడంతో నిలువనీడ లేకుండా ఉంది. ప్రభుత్వం ఆదుకొని తమ కుటుంబానికి సాయం అందించాలని పోచవ్వ అధికారులను వేడుకుంటోంది.

అసభ్యకర పోస్ట్‌లు పెట్టిన ఇద్దరిపై కేసు

ఇల్లంతకుంట: సామాజిక మాధ్యమంలో అసభ్యకరంగా పోస్టులు పెట్టిన ఇద్దరిపై కేసునమోదు చేసినట్లు ఎస్సై అశోక్‌ శుక్రవారం తెలిపారు. నర్సక్కపేటకు చెందిన కొత్త రాజు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణపై అసభ్యకర పోస్ట్‌లు పెట్ట డంతో అతనిపై కేసునమోదు చేశామన్నారు. ము స్కానిపేటకు చెందిన ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యుడు సామన పెల్లి శంకర్‌ను అవమానపరిచేలా ఇల్లంతకుంటకు చెందిన ఎండీ సాదుల్‌ పోస్టులు పెట్టడంతో అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.